క్లుప్తంగా

సాగరమాత ఆలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్ మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా అచ్చంనాయుడు



గురజాల : సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా అచ్చంనాయుడు ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన సీహెచ్‌వీఎన్ సుబ్బారెడ్డి అనంతపురం జైల్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. అనంతపురం నుంచి గురజాలకు అచ్చంనాయుడు బదిలీపై వచ్చారు.

చెన్నై రూట్ మార్పు
డీఎం బత్తుల వీరాస్వామి

మాచర్ల : పల్నాడు జిల్లా మాచర్ల పట్టణం నుంచి చెన్నై నగరానికి సూపర్ లగ్జరీ బస్సును ఆర్టీసీ ఇప్పటికే నిర్వహించటం జరుగుతుందని డీఎం బత్తుల వీరాస్వామి ఆదివారం తెలిపారు. అయితే గతంలో మాచర్ల ఆర్టీసీ డిపో నుంచి రెంటచింతల, గురజాల, పిడుగురాళ్ల, నరసరావుపేట, ఒంగోలు మీదుగా నడిపేందుకు నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. గతంలో ఈ సర్వీసు వినుకొండ, పొదిలి మీదుగా వెళ్లేదన్నారు. పట్టణ ప్రజలు, ప్రయాణికులు ఈ బస్సును వినుకొండ పొదిలి మీదుగా కాకుండా రెంటచింతల, గురజాల, పిడుగురాళ్ల, నరసరావుపేట మీదుగా నడపాలని కోరగా రూట్ మార్చినట్లు తెలిపారు. ఈ విషయం గమనించి ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీశ్రీనివాసరావు



గురజాల రూరల్ : మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చింతా లక్ష్మీశ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్ష ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా చింతా లక్ష్మీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్య వైశ్య పేద విద్యార్థుల విద్యా, వైద్యం కొరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం పలువురు చింతా లక్ష్మీ శ్రీనివాసరావును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏచూరి శ్రీనివాసరావు, బి.అక్కేశ్వరరావు, మాశెట్టి బుజ్జి, బి.వెంకటేశ్వర్లు, జి.పెద కోటేశ్వరరావు, టి.హనుమంతరావు, మూర్తి శ్రీనివాసరావు, పుల్లారావు, ప్రభాకర్, భవిరిశెట్టిఫణి, చీతిరాల సుబ్బారావు, పోలా సతీష్ తదితరులున్నారు.

భావనారుషి కల్యాణోత్సవాలు ప్రారంభం



మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనారుషిస్వామి వారి 45వ కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్వామి వారి మంగళస్నానాల అనంతరం కలశ స్థాపన, స్వామి వారి ప్రభ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం పూలు రాల్చుట, నైవేద్య పంపిణీ, మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం, బుధవారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పట్టణ ప్రణాళికా అధికారిగా రాధాకృష్ణ

సత్తెనపల్లి: పట్టణ ప్రణాళికా అధికారిగా పుల్లా రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి ఆయన బదిలీపై సత్తెనపల్లి టీపీఓ వచ్చారు. ఇక్కడ టీపీఎస్‌లు గా పని చేస్తున్న సునీత, రిజ్వానాలు టీపీవోలుగా ఉద్యోగోన్నతి పొంది విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అందరి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణను పలువురు మున్సిపల్ ఉద్యోగులు అభినందించారు.

వరుస దొంగతనాలు.. ఆందోళనలో రైతులు

- ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ లక్ష్యంగా చోరీలు
- పొలాల వద్ద రాత్రి సమయంలో కాపలా ఉండాల్సిన పరిస్థితి
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



రెంటచింతలలో చోరికి గురైన ఏజీఎల్ ట్రాన్స్‌ఫార్మర్

రెంటచింతల: కాల్వల ద్వారా సాగునీరు అందుబాటులో లేని పక్షంలో పంట పొలాల్లో బోర్లు వేసుకుని సాగు చేస్తూ పంటలను కాపాడుకునేందుకు రైతులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల కాలంలో వరుసగా ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీలు జరుగుతుండటంతో మండల పరిధిలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాదాపు 3 నెలల్లో 9 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురి కావడం రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుంది. రెంటచింతల గ్రామ సమీపంలోని పంట పొలాల్లో రైతులు పేర్ల ముత్తయ్య, వెంకటరెడ్డి ఏర్పాటు చేసుకున్న ఏజీఎల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ కొద్ది రోజుల కిందట చోరీకి గురైంది. ఇటీవల గ్రామానికే చెందిన పల్లెర్ల చిన్న వెంకట నర్సిరెడ్డి, పంగులూరి పూర్ణచంద్రరావు, మద్దిరాల అంకిరెడ్డి, మంచికల్లు గ్రామానికి చెందిన లింగిరెడ్డి కోటిరెడ్డి, ధర్మనబోయిన రామచంద్రరావు పంట పొలాల్లో నున్న ఏజీఎల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ కూడా చోరీకి గురైంది. పొలాల్లో నున్న 25 కేవీ, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని కాపర్ వైర్‌ను చోరీ చేస్తున్నట్లు రైతులు తుమ్మా రాయపురెడ్డి, మద్దిరాల అంకిరెడ్డి వాపోతున్నారు. కొంత కాలంగా రెంటచింతల పరిసర ప్రాంతాలలో ఎక్కువగా ఈ చోరీలు చోటు చేసుకుంటుడటంతో కొందరు రైతులు రాత్రి సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కాపలాగా అక్కడే పడుకుంటున్నారు. ఈ ప్రాంతంలో నున్న ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్‌వైర్‌ను దొంగిలించటంతో కొందరు రైతులు పోలీసులను ఆశ్రయించారు. ఒక్కొక్క 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 44 నుంచి 46 కేజీలు, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 48 కేజీల కాపర్ వైర్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. రైతులు మరలా కొత్తది కొనుగోలు చేయాలంటే ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.40 వేలు ఖర్చు అవుతుందని గంజి ఇన్నారెడ్డి అనే రైతు తెలిపారు. కొందరు సులభంగా నగదు సంపాదనకు అలవాటు పడిన వారు జన సంచారం లేని రాత్రి సమయాల్లో పంట పొలాల్లో నున్న ఏజీఎల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీలు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

కాపలా ఉండాల్సి వస్తుంది



సాగు చేసిన పంటలు సరిగ్గా పండక.. పండిన పంటకు గిట్టుబాటు ధర దక్కక అల్లాడిపోతున్న సమయంలో పంట పొలంలో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్‌వైర్ చోరీ చేశారు. మరలా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. దీంతో రాత్రి సమయాల్లో పొలాల్లోనే కాపలా ఉండాల్సి వస్తుంది.

– పేర్ల ముత్తయ్య, రైతు రెంటచింతల

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పంట పొలాల్లో ఏజీఎల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్న మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంట పొలాల్లో రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తారసపడిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇప్పటి వరకు గ్రామాలలో జరిగిన చోరీలకు సంబంధించి బాధితులైన రైతులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– షేక్ మస్తాన్‌వలి, ఏపీ ట్రాన్స్‌కో ఏఈ, రెంటచింతల

కౌన్సిలర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



పిడుగురాళ్ల: అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపల్ కౌన్సిలర్ ఉప్పు వెంకటేశ్వర్లను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ 33వ వార్డు కౌన్సిలర్ ఉప్పు వెంకటేశ్వర్లు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఉప్పు వెంకటేశ్వర్లు గృహానికి శనివారం రాత్రి హాజరై కౌన్సిలర్‌ను పరామర్శించారు. వారి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కౌన్సిలర్లు బాబు, మాదాల కిరణ్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి కల్యాణం

అచ్చంపేట: మాదిపాడు పంచాయతీ అడవులలో స్వయంభు సత్తెమ్మతల్లి దేవాలయంలో ఆదివారం జరిగిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. ప్రధాన అర్చకులు మేడేపల్లి అప్పయ్యశాస్త్రి కల్యాణం జరిపించారు. దేవాలయ కమిటీ చైర్మన్ కొరివి వెంకట నరేష్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

దేవాలయాల నిర్మాణం ఐక్యతకు, అభివృద్ధికి దోహదం

ఎమ్మెల్యే జేబీఆర్

మాచర్ల రూరల్: గ్రామ ప్రజలంతా కులమతాలకతీతంగా ఐక్యంగా కోదండరామాలయం నిర్మించుకోవటం గ్రామ ఐక్యతకు, అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అచ్చమ్మకుంట గ్రామంలో కోదండరామాలయం భూమి పూజకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన అచ్చమ్మకుంట గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రజలంతా కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని అన్నారు. ఆలయ అర్చకులు మూర్తి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, నాయకులు గుండాల శ్రీనివాసరావు, రాజబోయిన మధు, కొమెర దుర్గారావు, కొమెర అనంతరాములు, సాతులూరి రమేష్, సీతా అంజి యాదవ్ తదితరులున్నారు.

● ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ



రెంటచింతలలో ఉదయం 8.30 గంటల సమయంలో కురుస్తున్న మంచు

మండల కేంద్రమైన రెంటచింతల పరిసర ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల వరకు మంచు.. మధ్యాహ్నం 3.30 గంటల వరకు భగభగ మంటూ ఎండ మండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. వేకువజాము నుంచి తీవ్రమైన మంచు కురుస్తుండటంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హెడ్ లైట్స్ వేసుకుని నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు చుర్రుమంటూ ఎండ కాస్తుండటంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ ఇదెక్కడి వాతావరణంరా బాబూ అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

- రెంటచింతల

ప్రజాభద్రతకు ఆధునిక భరోసా

పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు



పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఉన్న డిజిటల్ బారికేడ్

పిడుగురాళ్ల: ప్రజాభద్రతకు ఆధునికత తోడైతే మరింత భరోసా ఏర్పడుతుందని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు ఆదివారం తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా డిజిటల్ బారికేడ్స్‌ను విడుదల చేశారు. ఈ క్రమంలో పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధికి కొన్ని డిజిటల్ బారికేడ్స్‌ను పంపించారు. డిజిటల్ బారికేడ్స్ వలన ప్రజా భద్రతకు భరోసా ఉంటుందని సీఐ తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో బారికేడ్స్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, ఏమైనా రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీల సందర్భాల్లో, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఈ డిజటల్ బారికేడ్స్‌ను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. వీటికి సోలార్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందని, నిఘా నేత్రాలు ఉంటాయని, అలాగే సెన్సార్ ద్వారా మాటలు రికార్డు చేసే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ఈ డిజిటల్ బారికేడ్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిని కెమెరాలలో భద్రత పరుస్తుందని, అప్పటికప్పుడు చర్యలు తీసుకోవటం జరుగుతుందని సీఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మాచర్ల: పట్టణంలోని రామాటాకీస్ లైన్‌లో శ్రీకృష్ణ జనరల్ ఆసుపత్రి వైద్యులు గుర్రం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈఎన్‌టీ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించగా 100 మంది వైద్యం పొందినట్లు డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ముక్కు, చెవి, గొంతు, థైరాయిడ్ వ్యాధులకు సంబంధించి నరసరావుపేటకు చెందిన కొండవీటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులపై ప్రత్యేకమైన డిస్కౌంట్ ఇచ్చి రోగులకు సలహాలిచ్చారు. రాబోయే రోజుల్లో ఉచిత వైద్య సేవలను తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో అందిస్తామన్నారు.

ఏకాగ్రతతో విద్యనభ్యసించి ఉన్నత స్థానానికి వెళ్లాలి



మాచర్ల: పల్నాడు జిల్లాలో ప్రతి విద్యార్థిని చైతన్యపరచి ఉన్నత స్థానాలకు తీసుకెళ్లే విధంగా తీర్చిదిద్దటంలో ప్రైవేటు విద్యా సంస్థలు ముందంజలో ఉండాలని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీజేఎస్ ధన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 14వ వార్డులో జెనిత్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకలలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా విజయవంతంగా ఏకాగ్రతతో విద్యనభ్యసించి ముందుకెళ్లాలన్నారు. ఎంఈఓ అల్లి సురేష్ మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థులకు మేలు చేసేలా విద్యాబోధన చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దశరథ్, జి.వెంకట్రామిరెడ్డి, ఎస్.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ పద్మజ, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు మాట్లాడారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

నేడు శిశు మందిర్‌లో అక్షరాభ్యాసం

సత్తెనపల్లి: వసంత పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం అక్షరాభ్యాసం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు పులుపుల వెంకట ఫణికుమార్ శర్మ హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు హోమం, 9:45 గంటలకు అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుందన్నారు.

కరుణ కలిగిన తల్లి కానుకమాత

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



కానుకమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: కరుణామయురాలైన కానుకమాత దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన స్థానిక కానుకమాత చర్చి 175వ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విచారణ సహాయ గురువులు రె.ఫాదర్ అగస్టీన్ ఎమ్మెల్యేకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ మరియతల్లి తన కుమారుడైన ఏసుక్రీస్తును లోక రక్షణ కోసం దేవునికి కానుకగా సమర్పించిన కరుణకల్గిన తల్లిగా కొనియాడబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అష్టకళల అభివృద్ధి కమిటీ చైర్మన్ చేర్రెడ్డి మంజుల, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి, టీడీపీ నాయకులు బి.రామకృష్ణ, మూలి రాజారెడ్డి, గొట్టం గురవారెడ్డి, మండలపు హనిమిరెడ్డి, మున్నా ప్రభురాజు, అల్లం బ్రహ్మారెడ్డి, నీలం మల్లయ్య, ఎన్.నర్సింహారావు తదితరులున్నారు.

వెంకటసైదయ్య సేవలు ప్రశంసనీయం

ఎస్ఐ నాగార్జున



రెంటచింతల: కానుకమాత చర్చి 175వ మహోత్సవ వేడుకలకు విచ్చేసిన వేలాదిమంది భక్తులకు స్థానిక వైఆర్ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్, ఆర్యవైశ్య మండల సంఘం మాజీ అధ్యక్షుడు యేచూరి వెంకటసైదయ్య మజ్జిగ, తాగునీరు ఉచితంగా పంపిణీ చేస్తూ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్ఐ సీహెచ్ నాగార్జున అన్నారు. ఆదివారం వెంకట సైదయ్య ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీరు పంపిణీ కేంద్రాన్ని ఆయన ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గత 16 సంవత్సరాలుగా భక్తులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న వెంకట సైదయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్ఐ నాగార్జునను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాళం పెదబాబు, ఎం.నాగేశ్వరరావు, పొట్టిమూర్తి రాంబాబు, యేచూరి ముసలయ్య, గుండా కిశోర్ తదితరులున్నారు.

రేషన్‌కు బదులు నగదు ఇస్తే డీలర్‌షిప్ రద్దు

తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్



రేషన్ దుకాణంలో బయోమెట్రిక్ యంత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్ల రూరల్: చౌక డిపోల నిర్వాహకులు లబ్ధిదారులకు రేషన్ ఇవ్వకుండా నగదు చెల్లిస్తున్నారని, అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారి రేషన్ షాపును సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని తాళ్ళపల్లి, కొత్తపల్లి, చింతలతండా గ్రామాలు, మాచర్ల పట్టణంలోని పలు రేషన్ షాపులలో తనిఖీ నిర్వహించి మాట్లాడారు. ప్రతి నెలా నిర్ణీత తేదీల్లో రేషన్ బండ్లు వారికి నిర్దేశించిన ప్రాంతాలలో కచ్చితంగా ప్రతి కార్డుదారుకు రేషన్ సరుకులు అందించాలని ఆయన ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో బియ్యం ఇవ్వకుండా వాటికి ప్రత్యామ్నాయంగా కేజీకి రూ.10 చొప్పున నగదు చెల్లిస్తున్నారని, కొన్ని ప్రాంతాలలో అసలు సరుకులు కూడా అందించటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవని రేషన్ షాపులోనూ రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తారని, ఆ సమయంలో సరుకులలో వ్యత్యాసముంటే కేసు నమోదు చేసి సస్పెండ్ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్‌ఓలు ఖాజావలి, ప్రశాంతి, ఆరుముళ్ళ నాగేశ్వరరావు, అంజి, జలీల్, హుస్సేన్, నాగలక్ష్మి, వీఆర్‌ఏ శ్రీను తదితరులున్నారు.

వై జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్



నకరికల్లు: మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై వై జంక్షన్ వద్ద ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలు నిలిపి తనిఖీలు చేశారు. డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్‌లతో పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారిపై ఐదు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రమాదాలు అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ప్రధానంగా మద్యం తాగి వాహనాలు నడిపి ఎదుటి వారికి ప్రాణాపాయం తీసుకురావద్దని సూచించారు.

రబీలో ముమ్మరంగా వరి సాగు




నాట్లు వేస్తున్న కూలీలు

మాచవరం: ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురవడంతో సాగునీటి ప్రాజెక్టులు జలకళ సంతరించుకొని నిండుకుండగా మారాయి. సాగు నీటికి ఇబ్బందులు లేకపోవడంతో ఖరీఫ్, రబీలో వరి సాగు ముమ్మరంగా చేపట్టారు. ఖరీఫ్‌లో తుపాన్ కారణంగా హడావుడిగా వరి కోతలు చేపట్టి వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కంటే తక్కువకు పంటను రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. చేసేదిలేక అన్నదాతలు రబీలోనైనా కాస్త లాభాలు పొందవచ్చనే ఆశతో వరి సాగు చేపడుతున్నారు. పెట్టుబడులు పెరిగాయని, సాగు పెట్టుబడులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధరలు కల్పిస్తే పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

నియోజకవర్గంలో సాగు ఇలా...

గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రైతులు వరి సాగు చేపడుతున్నారు. పిడుగురాళ్ల, గురజాల మండలాల్లో సాగునీరు, భూగర్భ జలాలు, బావులు, బోర్లు అనుకూలంగా ఉండడంతో సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. మాచవరం, దాచేపల్లి మండలాలు మెట్ట ప్రాంతం అయినప్పటికీ గతేడాది కంటే ఈ ఏడాది సాగు ఎక్కువ అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మాచవరం మండలంలో 350 ఎకరాలు, దాచేపల్లి 250 ఎకరాలు, పిడుగురాళ్ల 1,800 ఎకరాలు, గురజాలలో 7,550 ఎకరాల్లో రబీలో వరి సాగు చేపడుతున్నట్లు వ్యవసాయాధికారులు తెలియజేశారు.

పెట్టుబడులు బాగా పెరిగాయి



గతేడాది కంటే ఈ ఏడాది కూలీల రేట్లు అధికం కావడంతో పాటు, ట్రాక్టర్, ఎరువులు, పురుగు మందులు ధరలు పెరగడంతో పెట్టుబడులు పెరిగాయి. ధాన్యానికి తగిన గిట్టుబాటు ధర ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. ఖరీఫ్‌లో తగిన రాబడి రాలేదు. రబీలోనైనా లాభాలు వస్తాయన్న ఆశతో వరి సాగు చేస్తున్నా.


– ఎం.రామాంజినేయులు, గాంధీనగరం

మద్దతు ధర లేదు

నేను 8 ఎకరాలలో వరి సాగు వేసాను. ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా సాగు చేయడం జరిగింది. పెట్టుబడులు పెరిగిపోయాయి గానీ మద్దతు ధర మాత్రం తగ్గింది. గతంలో క్వింటా రూ.2 వేలు ఉండగా ఖరీఫ్ పంటను రూ.1600కే విక్రయించాల్సి వచ్చింది. ప్రభుత్వం రైతుల సమస్యను విని వరికి మద్దతు ధర కల్పించాలి. రబీలోనైనా మంచి ధర పలికేలా చూడాలి.

– శౌరెడ్డి, రైతు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రబీలో వరి సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ అధికారుల సలహాల మేరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సాగు చేపట్టిడే అధిక దిగుబడులు సాధ్యపడతాయి. అధిక రసాయన ఎరువులు, మందుల వాడకం తగ్గించుకోవాలి. తగిన సమయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం చేపడితే ఖర్చులు తగ్గుతాయి.

– ఏఓ. కె.రామమ్మ, మాచవరం

● ఈత పోటీల్లో సత్తెనపల్లి వాసులు

సత్తెనపల్లి: విజయవాడలోని దుర్గ ఘాట్ వద్ద కృష్ణానదిలో ఆక్వా డెవిల్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈతపోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో సత్తెనపల్లి వాసులు గని, హనుమంతరావు, జోజి,శ్రీనివాస్, శ్రీనివాస్, నరసింహారావు, రమేష్, ఆదిరెడ్డి, సాంబశివరావు, రాజేష్ నాయక్, బుజ్జి పాల్గొన్నారు.